"ఇంగో పుల్లట్టేత్తున్నా! తిను బావా!" పొయ్యిలోకి చితుకులు తోపి పెనం అట్లకాడతో శుభ్రంచేసి అంది సోవమ్మ.

పొయ్యి ఎదురుగా మునిగాళ్ళ మీద కూర్చున్న గంటయ్య వల్లటి శరీరం మీద చెమట దిగగారుతున్నది. చెమట కారిన వళ్ళు వానలో తడిసిన కారెనుము శరీరంలా వుంది.

"పైసలన్నీ నీకె యిస్తే ఇంటికేం దీసుకెళ్ళనే?" అన్నాడు గంటయ్య.

"తినకుండానే డబ్బుల్దాస్తవా బావా? అయినా పెద్ద బుట్టెడు చింతపండు దెస్తివి! పైసలకేం తక్కువ?" ప్రశ్నించింది సోవమ్మ

అట్లు తిండం అయింది లెక్క చూచి డబ్బు సోవమ్మ చేతిలో వుంచి :

"చూడవే సోమీ! రెండుంగాల మిగిలింది" అంటూ మిగిలిన డబ్బు చూపించాడు.

"ఎట్టా! అంత బుట్టెడు పండుకు ఎంతిచ్చినదేం గవరయ్య?"

"మూడ్రూపా యిచ్చిండు. నీకిచ్చిన సొమ్ము పోగా రెండుంగాల మిగిలె! దాంతో నేనూ గుడిశెలో ముసల్దీ వారంరోజులు బతకాలె!"

"అదేంది బావా! అర్ధవీశెడు పండుకు మూడ్రూపాయలేంది? ముక్కుపై వేలేసుకుంది సోవమ్మ.

మారు మాటాడకుండా ఖాళీ తట్ట నెత్తినుంచుకుని బయల్దేరాడు గంటయ్య.

రెండు రోజులపాటు అడవిలో చింత చెట్ల కాయలు దులుపుకొచ్చి. ఎండబెట్టి ముసల్దీ తనూ పై బెరడు తీసి పెద్ద తట్ట నిండా పోసి సావుకారు గవరయ్య కిస్తే. కింద పెట్టి మీదపెట్టి. ఎందుకొచ్చిందిరా అన్నట్లు మిర్రిమిర్రి చూచి నాలుక చప్పరించి ...

"ఎందిర గంటా ఇట్లాటి పండు దెచ్చినవ్? కొట్టునిండా పండు మూలుగుతుంది! ఎగుమతి నిల్చిపాయె! ఏం జేస్తును?" అన్నాడు.

"అట్టనగాకు దొరా! నీవు పండు దీసుకొనకపోతే నేనూ ముసల్దీ వస్తుండాలె! ఏదో నీ పేర్జెప్పుకుని యింత గంజి తాగుతుండం" న్నాడు.


"ఊరోల్లందర్నీ మేపటానికి నేనేం జమీందార్నంటరా? సరే! అక్కర్లేకపోయినా నువ్వు వస్తుంటవని కొంటున్నా! ఇంద" అంటూ తన ప్రాణం తీసి యిస్తున్నట్లు మూడు రూపాయలు తీసి గంటయ్య చేతిలో పెట్టాడు.

దేముడి ప్రసాదం కళ్ళకద్దుకున్నట్లు ఆ మూడు కరుకులూ జేబులో వేసుకుని వస్తుంటే

గండు మీసాల వెనక నిండుగా నవ్వుతూ చేయి చాపాడు రౌడీ కిష్టిగాడు షావుకారు షాపు ముందు ఉత్సవ విగ్రహంలా నుల్చుంటాడు.

పావలా సమర్పించుకోక తప్పలా గంటయ్యకు!

జరిగిన విషయం తల్చుకుంటే కడుపులో దేవినట్లయింది గంటయ్యకు.




రెండుంగాల రూపాయల పెట్టి కొనగా వచ్చిన జొన్నలు తట్టలో పోసుకుని యింటికి బయల్దేరాడు.

గుడిశె దగ్గర ముసల్ది తట్ట కడుగుతున్న కూసిని జొన్నలు చూచి గతుక్కుమంది.

"తట్టెడు పండుకి బుట్టెడు జొన్నలొచ్చినయ్! ఎట్ల బతకాలా? మా కట్టపు రోజులొచ్చినయ్ గందరా గంటా!" అంటూ.

జొన్నరొట్టెలు బెల్లం ముక్క నంజుకుంటూ తిన్నారా రాత్రి తల్లీ కొడుకూ!

తెల్లారి లేస్తూ "కొడలు చిలక ఎప్పుడొస్తదో? నా బాధలు ఎప్పుడు తీర్తయో?" అనుకోసాగింది ముసల్ది

"ఏందే? సంపాదన మనిద్దరి కడుపులకే చాలకపోతే మరో జింజుకాణ ఎందుకే?" అంటూ అడవికి పోయాడు.

అడవిలో సోవమ్మ కనబడ్డది ... అట్లపెనం కిందకి చితుకులేరుకోటానికి వచ్చింది.

చెట్టెక్కి పండుకాయలు కోసి పడేస్తూ వాటితో పాటు ఎండుకొమ్మలు విరిచి పడేయసాగాడు గంటయ్య. కిందపడ్డ చితుకులూ చింతకాయలూ ఏరిపెట్ట సాగింది సోవమ్మ.

పొద్దున 'మరో జింజుకాణ ఎందుకే' అని తల్లితో అన్నాడుగాని మరో మనిషిసాయం వుంటే ఎంత త్వరగా చింతకాయలు కోసి కుప్ప పెట్టెవచ్చో అర్థం అయింది గంటయ్యకు!

సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుంటే "ఏంది బావా! ఎన్నాళ్ళిలా వుండమంటావు నన్ను? గూడెంలో పోట్లగిత్తలూ. పొగరుబోతుల్నుంచీ తప్పించుకోటానికి ఎంత కష్టంపడుతున్నానో చూడ్డంలేదా నువ్వు?" అంది.

ఇదివరకలా అడిగినప్పుడు మారుజవాబు చెప్పకుండా వుండేవాడు. కాని ఇప్పుడు. "మాఘమాసంలో మనువాడతానే సోమీ! యీలోగా చేతిలో నాలుగుపైసలు మిగుల్చుకోవాలిగదా!" అన్నాడు.

"ఈసారి పండమ్మటానికెళ్తే నన్ను తోడు దీసికెళ్ళు" అంది సోవమ్మ. "సావుకారు ఏదో మోసం జేత్తన్నాడు. లేపోతే అంత తట్టెడు పండుకు మూడ్రూపాయలా?" అంది.

తలూపాడు గంటయ్య. అతనికి ఏదో అనుమానంగా వుంది! వారం రోజులు కష్ట పడితే మూడు రూపాయలా! అందులో మళ్ళా పావలా రౌడీ కిష్టిగాడి కివ్వాలా!

*   *   *

వండు తట్ట తలమీదుండటంతో భారంగా అడుగులు పడ్తున్నాయి గంటయ్యకు.


అతను పిలవకపోయినా వెంటనే వచ్చింది సోమి! 'మాగమాసంలో మను వాడతా' అన్నదగ్గర్నుంచీ ప్రతి పనిలోనూ తల్లికీ కొడుకూ- సాయంచేస్తూ వున్న దామె.

"ఏందిరా గంటా! వెంట పిల్లని దీసు కొచ్చావు!" మీసం మెలేస్తూ వెకిలిగా అన్నాడు కిష్టిగాడు.

వాడివంక జూస్తూ తుపుక్కున వుమ్మే సింది సోవమ్మ. గుర్రుగా చూచాడు కిష్టి గాడు.

షావుకారు గవరయ్య తట్టలో వండు చూచి "ఏందిరా అంతా మట్టికొట్టుకుంది వండు" అన్నాడు పెదవి విరుస్తూ.

ఏమనుకున్నాడో ఏమో షావుకారు మాట్లాడకుండా నాల్రూపాయలు తీసి గంటయ్య చేతిలో వుంచబోయాడు.




"ఏందయ్యా సావుకారూ! మణుగు వండుకు నాలుగు రూపాయలు చేతిలేస్తవా! ఇంతన్నాయమా!" అంది సోవమ్మ.

"చాల్చాల్లే! ఎల్లెహె!" అంటూ కిష్టిగాడు తట్ట తీసి లోపల పెట్టబోయాడు.

"ఆగు! తట వండుకు సరైన సొమ్మ ఇచ్చి మరీ తీసుకో!" అంటూ తట్ట పట్టు కోబోయింది సోవమ్మ.

"పోవే పో! నీ దిక్కున్న చోట చెప్పుకో" అంటూ ఎడం చేత్తో నెట్టబో యాడు కిష్టిగాడు.

అంతే! రౌద్రాకారం దాల్చిన గంటయ్య చేతుల్లో చిత్తుగా తన్నులు తిని మన్ను కరి చాడు కిష్టిగాడు.

షావుకారు గవరయ్య ఎప్పుడో ఇంట్లో దూరి తలుపేసుకున్నాడు.

*   *   *

మాఘమాసంలో గంటయ్యకు - సోవ మ్మకూ పెళ్ళి అయింది.

షావుకారు కొట్లో చింతవండు అమ్మ టానికి వెళ్ళేప్పుడు గంటయ్య వెంటే సోవమ్మ వెళుతున్నది!


# వనిత

స్త్రీ జన మాస పత్రిక

ఆగస్ట్ (84) సంచికలో....



విడిప్రతి: రూ. 2-50 సంవత్సర చందా: రూ. 30-00

పఠితలు ఎన్నుకున్న
'ఈ దశాబ్దపు వనిత'

పెద్ద కథల పోటీలో
రెండవ బహుమతి పొందిన
'స్వయంవరం' ప్రారంభం!

వనిత-పాండ్స్ సంయుక్తంగా సమర్పించు
సౌందర్య ప్రహేళికలో
ఉపయోగకరమైన మూడు బహుమతులు!

వాసిరెడ్డి సీతాదేవి
'వాస్తవగాథలు'లో 'విమల కథ'

జలంధర
మాగ్నటో తెరాపీ
ముగింపు భాగం

ఇంకా....

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి 'స్వయంసిద్ధ', పెదపూడి రాజ్యలక్ష్మీదేవి 'గాయత్రి' (పెద్దకథ), కలిదిండి జయ 'ఆఖరిమెట్టు', జె. వరలక్ష్మి యూరోప్ పర్యటన విశేషాలు (ఫిన్లాండు), సౌందర్య ప్రహేళిక-2 ఫలితాలతో పాటు మీరు మెచ్చే, మీకు నచ్చే మరెన్నో శీర్షికలతో వెలువడుతున్నది.

వివరాలకు: విజయా బుక్ హౌస్, చందమామ బిల్డింగ్స్, వడపళని, మద్రాసు-600 26